# షెనల్క్ టెన్సు

— బి. రఘురామరాజు



'న్యూవేవ్ సినీ ఎంటర్‌ప్రైజెస్'

బంజారాహిల్స్‌లోని ఓ అధునాతనమైన బిల్డింగ్ ముందు స్పష్టంగా రాసుంది.

ఉదయం పదిన్నర గంటలు.

అందమైన అమ్మాయిలు ఒక్కొక్కరూ ఆ భవనం దగ్గరకు చేరుకుంటున్నారు తమ అదృష్టం పరీక్షించుకోడానికి. ముందుగదిలో కూర్చోమని చెబుతున్నాడు బంట్రోతు.

పదకొండయ్యింది! అప్పుడే ఆగిన 'కాంటెస్సా' కారులోంచి దిగాడు ప్రముఖ దర్శకుడు వై.ఎస్.రావ్. అందరూ ఒక్కసారి, 'గుడ్ మార్నింగ్' అంటూ విష్ చేశారు రావ్‌ను చూడగానే. చెదరని చిరునవ్వుతో, ప్రతినమస్కారం చేసి తన గదిలోకి వెళ్లాడతను.

రెండు దశాబ్దాలనుండి తెలుగు చలనచిత్ర రంగానికి మకుటంలేని మహారాజు— వై.ఎస్.రావ్. సాంఘికమైనా, చారిత్రకమైనా, మరేదయినా ఆయన డైరెక్ట్ చేసిన సినిమాల్ని విరగబడి చూస్తారు జనం. నటుల్ని దృష్టిలో పెట్టుకొని కథ అల్లకుండా, కథను బట్టి నటుల్ని ఎంపికచేసే మనస్తత్వం ఆయనది. చాలా మంది కొత్తనటుల్ని వెండితెరకు పరిచయం చేశాడాయన.

తను డైరెక్టు చేయబోయే ఒక సినిమాకు కొత్త హీరోయిన్ కోసం గాలిస్తున్నాడాయన. కొత్త, పాతా చాలామంది ముందుకొచ్చారు నటిస్తామని. కానీ ఆయన పంథా ఆయనది. ఆరోజు ఎవర్ని హీరోయిన్‌గా ఎన్నుకునేది రావుగారు చెపుతారని ప్రకటించారు సినిమా నిర్మాతలు.

పదకొండు దాటి పది నిమిషాలవుతోంది!

# రంగుల ప్రపంచం వెనుక ఓటమి తెలీని గెలుపు

ఒక్కొక్క క్షణం ఒక్కో యుగంలా గడుస్తోంది అందరికీ!

ఆ సంపెంగమొగ్గ సరోజనా? ఆ మెరిసే పన్నున్న లావణ్యనా? లేక... ఆ కందిరీగ నడుమున్న సుకన్యనా? ఎవరు ఆ సూపర్ డైరెక్టర్ అందించబోయే సరికొత్త తారామణి?

అందరూ ఒకరివంక ఒకరు చూసుకున్నారు భయంగా, అసూయగా. 'మిస్ రమణి!... మిస్ హరిత!... మిస్ ప్రశాంతి!... వీళ్లను సార్ ఉండమన్నారు తక్కినవాళ్లు వెళ్లవచ్చు!' చల్లగా చెప్పాడు బంట్రోతు.

దురదృష్టవంతులు నిష్క్రమించారు.

ఎందుకు ముగ్గుర్ని ఆగమన్నారో అర్థంకాక బిక్కమొకం వేశారు అదృష్టవంతులు. లోపలికి పిలిచి 'కూర్చోండి!' అన్నారు రావుగారు.

పైప్‌లో 'టొబాకో ఫ్లేక్స్' నింపుతూ—

'స్క్రీనింగ్, వాయిస్ టెస్ట్ అన్నింటిలో మీ ముగ్గురికీ సమానంగా మార్కులొచ్చాయి. ఎవర్ని ఎన్నుకోవాలో నాకు తికమకగా ఉంది. ఇరవైయేళ్ల అనుభవంలో నన్ను ఇబ్బందిపెట్టిన సెలక్షన్ బహుశా ఇదేనేమో! రేపే మీకు ఫైనల్ టెస్ట్. అందులో విజేత ఈ నిర్మాణ సంస్థ నిర్మించే మూడు చిత్రాల్లో హీరోయిన్ అవుతుంది. రేపు రాత్రి సరిగ్గా తొమ్మిది గంటలకు 'హోటల్ అవంతి'కి మీరు రావాలి! రూం నెంబర్ 786. ఓ.కే!' చెప్పిపంపాడు రావ్.

'ఏం పరీక్ష పెడతాడబ్బా! కొంపదీసి... అది... అడుగుతాడేమో!' ముసిముసిగా నవ్వుకుంది రమణి.

'ఫైనల్ టెస్ట్ అంటే ఏమిటో నాకు తెలియదా? సినిమా వాళ్లకేం కావాలో ప్రపంచానికంతా తెలుసు. చూస్తాను హీరోయిన్ పాత్ర నాక్కాకుండా ఎవరికి దక్కుతుందో!' గర్వంగా అనుకుంది మిస్ హరిత.

'హోటల్ గదికి రమ్మన్నాడు. పైగా రాత్రిపూట. భగవాన్! ఏమైనా చేస్తాడా! శివశివా! ఏం చేయాలి?' దిండులో ముఖం దాచుకొని తీవ్రంగా ఆలోచించింది మిస్ ప్రశాంతి.

మర్నాడు రాత్రి 9–00 గంటలకు ముగ్గురూ 'హోటల్ అవంతి' చేరుకున్నారు.

ముందు రమణిని పిలిచారు లోపలికి. విశాలమైన ఎయిర్ కండిషన్డ్ గది! టేబిల్ మీద 'వాట్ 69' ఆకుపచ్చని సీసా! మూడయిదుల సిగరెట్ ప్యాక్! ఒక ఫైల్. అందులో ఆ ముగ్గురివీ— రకరకాల భంగిమల్లో ఫోటోలు.

ఎదురుగా వెళ్లి కూర్చుంది రమణి.

'చూడమ్మాయ్! నీకు బంగారంలాంటి భవిష్యత్ కల్పిస్తాను. డబ్బుకు డబ్బు, పేరుకు పేరూ అన్నీ నీ సొంతం రేపటినుంచీ! ఇన్నింటికిగాను ప్రతిఫలంగా నేను కోరేది అది ఒక్కటే! అదీ పది నిమిషాలు కళ్ళు మూసుకుంటే చాలు! ఆ మాత్రం త్యాగం చెయ్యకుంటే, తర్వాత ఏడవాల్సి వస్తుంది జీవితాంతం! ఏమంటావ్?' అడిగాడు వై.ఎస్.రావ్!

తనకు తెలియనట్టే, మెల్లగా భుజంమీద నుంచి పైటజార్చింది రమణి!

'సరేసార్! మీ ఇష్టం. ఆ మాత్రానికి అవకాశాలు వదులుకుంటారా ఎవరైనా!' అంటూనే రావ్‌ను వాటేసుకుంది రమణి. తదేకంగా చూశాడామెను. మెల్లగా కౌగిలి విడిపించుకొని టేబిల్ 'డ్రా' తెరిచి ఒక నీలం రంగు కవరందించి—

'ఇందులో ఏముందో, ఇంటికెళ్లాక చూడాలి మరి!' నవ్వుతూ రమణికిచ్చారు వై.ఎస్.రావ్! వయ్యారంగా రమణి వెళ్లగానే, హరిత వచ్చింది లోపలికి.

ఆమెను అదే కోరిక కోరాడు రావ్.

'సార్ నా భవిష్యత్తు, ఈ బాడీని మీ చేతుల్లో పెడుతున్నాను. పరోపకారార్థ మిదం శరీరమ్' అన్నారు పెద్దలు. కానీయండి మీ పని!' అంటూ చీరె చెంగుల్ని విప్పదీయబోయింది హరిత.

రావు ఆమెవంక చూశాడు రెప్పవాల్చకుండా!

'డ్రా' తెరిచి ఇంకో నీలంరంగు కవరు ఆమెకందించి, రమణికి చెప్పినట్లే ఆమెకూ చెప్పిపంపాడు.

సరిగ్గా తొమ్మిదిన్నరకి ప్రశాంతిని పిలిచారు లోపలికి!

వై.ఎస్.రావ్‌కి భయంభయంగా ఉంది ఎందుకో! వాళ్లిద్దర్నీ కోరిన కోరికే ప్రశాంతినీ కోరాడు ఆయన.

'ఛీ! ప్రేక్షకులంతా గొప్ప దర్శకుడివంటుంటే ఏమో అనుకున్నాను. నీ అసలురంగు ఇదా! నా 'టాలెంట్'చూసి ఇస్తేనే వేషం వేస్తాను. కానీ ఈ నీచపు పనులకి ఛస్తే ఒప్పుకోను. నీకూ, నీ 'రోల్'కు ఓ దండం!'—

వేగంగా శ్వాసతీసుకుంటూ, ఆడపులిలా గర్జించింది ప్రశాంతి.

అందినచోటల్లా రావ్‌ని కరిచింది. రక్కింది గోళ్లతో. గదినిండా ఎటుచూసినా రాలిన మల్లెమొగ్గలే.

రావ్ కళ్లు మెరిశాయి. 'ఎక్సలెంట్!' ఆనందం పట్టలేక అరిచాడాయన. హోటల్ బాత్రూంలోంచి బయటికొచ్చాడు కెమెరామెన్, తన పని ముగించుకొని.

'మొదటి సినిమాలోని మొదటి షాట్‌లోనే ఇలా నటిస్తావని నేనూహించలేదు. నువ్వు నటించలేదు. జీవించావమ్మా! తెలుగు 'సినీఫీల్డ్'కి నువ్వే మహారాణివవుతావు. అయామ్ ప్రౌడ్ ఆఫ్ యూ! డాటర్! అవును అన్నట్టు— ఈ సినిమాలో నేను విలన్ పాత్ర వేస్తున్నాను. నీది 'కొత్త హీరోయిన్' పాత్ర. సహజత్వం కోసం ఇది సినిమా అని మీతో ఎవరితోనూ చెప్పలేదు!' అంటూ జారిన ప్రశాంతి పైటను ఆమె భుజాల మీద నిండుగా కప్పాడు డైరెక్టర్ వై.ఎస్.రావ్.

డ్రాయర్ తెరిచి, ఎరుపురంగు కవరొకటి ప్రశాంతి కందించాడు ఆయన. ఓటమికి, 'నీలం రంగు', గెలుపుకు ఎరుపురంగు వాడడం వై.ఎస్.రావ్‌కి అలవాటు!

## క్యాన్సర్‌కు మందు

తూర్పు జర్మనీకి చెందిన ఒక మందుల కంపెనీ క్యాన్సర్ వ్యాధి నివారణకు ఒక కొత్తరకం ఔషధాన్ని కనుగొన్నదట. ఈ మందు క్యాన్సర్ 'సెల్స్' మీద దాడిచేసి వాటిని నాశనం చేస్తుందట. గ్రాములో ఏడవవంతు బరువుగల మందుతో 250 మందికి ట్రీట్‌మెంట్ ఈయవచ్చునట. ఈ క్యాన్సర్ డ్రగ్‌ను సింథసైజ్ చేసి మార్కెట్లోకి పంపించే ప్రయత్నాలను జర్మన్ ప్రభుత్వం ముమ్మరం చేస్తోంది.

'సైశ్రీ'





## కరోలిన్ కింగ్

ఈ ఫోటోలో కనిపించే అమ్మాయి పేరు 'కరోలిన్ కింగ్'. వయస్సు 20 సంవత్సరాలు. న్యూయార్క్ దగ్గరున్న 'జోహాన్స్ వెన్నింగ్' అనే బస్తీలో సివిల్ సర్వెంటుగా పనిచేస్తోంది.

ఈ మధ్య కాలిఫోర్నియాలో జరిగిన బ్యూటీ కాంటెస్టులో మూడో బహుమతి పొందింది. ఈ అమ్మాయి కొలతలు 36: 24:34

'సైశ్రీ'